



www.epapersamayam.com

APTEL/2006/18267

# సమయం

మన గొంతుకే.. మన పత్రిక

తెలుగు దినపత్రిక

SAMAYAM

సంపుటి : 18 | సంచిక : 188 | ఎడిటర్ : విక్రం కుమార్ | సోమవారం 17 మార్చి 2025 | ప్రచురణ : హైదరాబాద్ | పేజీలు: 8 | వెల: రూ.5


## పాక్‌తో శాంతికి యత్నిస్తే
# ద్రోహం ఎదురైంది



- ఫ్రిడ్‌మాన్‌కు ఇచ్చిన పాడ్‌కాస్ట్ ముఖాముఖిలో ప్రధాని మోదీ

**సమయం న్యూస్, దిల్లీ:** పాకిస్థాన్‌తో శాంతి కోసం చేసిన ప్రతి ప్రయత్నానికి ద్రోహం, శత్రుత్వం ఎదురయ్యాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేసుకునే బాధ్యత ఇస్లామాబాద్ నాయకత్వం పైనే ఉందన్నారు. రెండు దేశాలు కొత్త **తరువాయి 2లో**



### ఈశాన్య రాష్ట్రాల్లో
## కొత్త 'నేర'చట్టాల అమలుపై అమిత్ షా సమీక్ష

**గువాహటి/కోక్రాఝార్, సమయం న్యూస్:** కేంద్ర ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన మూడు నేర న్యాయ చట్టాలు 8 ఈశాన్య రాష్ట్రాల్లో అమలు జరుగుతున్న తీరును కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఆదివారం సమీక్షించారు. భారతీయ నాగరిక్ సురక్షా సంహిత (బీఎన్ఎస్ఎస్), భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్), భారతీయ సాక్ష్య **తరువాయి 2లో**

# అప్రమత్తతే.. శ్రీవారి రక్ష!

- సాంకేతికత సాయంతో భక్తుల దోపిడీ
- మధ్యవర్తులను ఆశ్రయించవద్దని తితిదే సూచన

**సమయం న్యూస్, తిరుమల :** శ్రీవారి దర్శనార్థం తిరుమలకు తరలి వచ్చే పలువురు భక్తులు దళారుల చేతుల్లో మోసపోతున్నారు. తిరుమలకు నిత్యం 40 వేల నుంచి లక్ష మంది భక్తులు వస్తారు. రద్దీని అవకాశంగా మలుచుకుంటున్న కేటుగాళ్లు సాంకేతికత, పరిచయాల ద్వారా, తితిదే ఉద్యోగుల పేరుతో, **తరువాయి 2లో**



## అప్పులు.. అవినీతిలో కేసీఆర్‌తో రేవంత్ పోటీ

- డీలిమిటేషన్‌పై కాంగ్రెస్, డీఎంకేలది దివాలాకోరుతనం
- కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి విమర్శలు



సమయం న్యూస్, హైదరాబాద్: అధికారం లోకి వచ్చిన 15 నెలల్లోనే కాంగ్రెస్ ప్రభుత్వం రూ.1.52 లక్షల కోట్లు అప్పు చేసిందని.. అప్పులు, అవినీతితో పాటు అన్ని విషయాల్లో కేసీఆర్‌తో రేవంత్‌రెడ్డి పోటీ పడుతున్నారని కేంద్ర మంత్రి, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి విమర్శించారు. భాజపా రాష్ట్ర కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 'రాష్ట్రంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తోంది. తాజాగా ఉస్మానియా యూనివర్సిటీలో ధర్నాలు చేయొద్దని ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో భారాస ఇదే తీరుగా వ్యవహరించింది. కేసీఆర్‌కు మీకు తేడా ఏంటో చెప్పాలి. ఇసుక వ్యాపారం, లిక్కర్ దోపిడీ, బెల్టుషాపులు, అక్రమ భూముల వ్యాపారంలో **తరువాయి 2లో**




## నేడు శాసనసభలో
# రెండు చరిత్రాత్మక బిల్లులు

- ఎస్సీ వర్గీకరణ, బీసీలకు 42% రిజర్వేషన్లు..
- సామాజిక న్యాయాన్ని కాంక్షిస్తూ ప్రవేశపెట్టనున్న ప్రభుత్వం

**సమయం న్యూస్, హైదరాబాద్:** రాష్ట్రంలో సామాజిక వర్గాల సంక్షేమాన్ని కాంక్షిస్తూ రెండు చరిత్రాత్మక బిల్లులను ప్రభుత్వం సోమవారం శాసనసభలో ప్రవేశపెట్టనుంది. బీసీలకు విద్య, ఉద్యోగాలు, రాజకీయాల్లో రిజర్వేషన్లను 42 శాతానికి పెంచడంతో పాటు సుప్రీంకోర్టు తీర్పునకు లోబడి ఎస్సీల వర్గీకరణకు చట్టబద్ధత కల్పించనుంది. వీటికి ఇప్పటికే మంత్రివర్గం ఆమోదం తెలపడంతో బిల్లులకు శాసనసభ ఆమోదం తీసుకోనుంది. ఎస్సీ వర్గీకరణ, బీసీ రిజర్వేషన్ల పెంపుపై శాసనసభ, మండలిలో సోమ, మంగళవారాల్లో ప్రత్యేక చర్చ జరగనుంది. బీసీ రిజర్వేషన్ల పెంపు కోసం ప్రభుత్వం సామాజిక, ఆర్థిక కుల సర్వే నిర్వహించింది. ఈ నివేదిక **తరువాయి 2లో**

# కేసీఆర్ చిట్టా విప్పుతా

- ఆయన కుటుంబం రూ.లక్ష కోట్లు దోచుకుంది
- ప్రజలకు రాష్ట్ర ఆర్థిక పరిస్థితి గురించి తెలియాలి.. అసెంబ్లీలో వివరిస్తా
- ఆదాయం తగ్గినా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నాం
- స్టేషన్ ఘన్‌పూర్ 'ప్రజాపాలన-ప్రగతిబాట' సభలో సీఎం రేవంత్‌రెడ్డి
- రూ.630 కోట్ల అభివృద్ధి పనులకు



### శంకుస్థాపన చేసిన ముఖ్యమంత్రి

**సమయం న్యూస్, వరంగల్:** ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తున్నామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. బస్సుల్లో మహిళల ఉచిత ప్రయాణానికిగాను ఆర్టీసీకి ఇప్పటివరకు **తరువాయి 2లో**





## ఆంధ్రా ఆసుపత్రిలో తల్లిపాల బ్యాంకు

- ప్రారంభించిన నమ్రతా మహేష్‌బాబు

**సమయం న్యూస్, విజయవాడ(గవర్నర్‌పేట) :** నవజాత శిశువుల కోసం తల్లిపాల బ్యాంకు ఏర్పాటు చేయటం అభినందనీయమని నమ్రతా మహేష్‌బాబు పేర్కొన్నారు. రోటరీ క్లబ్ ఆఫ్ విజయవాడ, ఆంధ్రా ఆసుపత్రి సంయుక్తంగా రూ.37.24 లక్షల వ్యయంతో.. ఆంధ్రా ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన తల్లిపాల **తరువాయి 2లో**



## ట్రంప్ దూకుడుకు
# న్యాయస్థానం కళ్లెం

- 227 ఏళ్ల నాటి చట్టం ఆధారంగా ఇచ్చిన ఉత్తర్వు నిలుపుదల

**సమయం న్యూస్, వాషింగ్టన్:** వెనెజువెలా వలసదారులను దేశం నుంచి తరలించేందుకు ట్రంప్ యంత్రాంగం 227 ఏళ్ల నాటి చట్టాన్ని వినియోగించడాన్ని అమెరికా ఫెడరల్ జడ్జి అడ్డుకున్నారు. వెనెజువెలా నేర ముఠాకు చెందిన వలసదారులు అమెరికాకు వ్యతిరేకంగా అక్రమ యుద్ధం చేస్తున్నారని.. వారిని ఏలియన్స్ ఎనిమీ యాక్ట్ (1798) ప్రకారం తిప్పి పంపాలని శనివారం ట్రంప్ ప్రకటన జారీ చేశారు. అయితే అదే రోజు సాయంత్రం యూఎస్ డిస్ట్రిక్ట్ జడ్జి జేమ్స్ బోస్‌బెర్గ్ ట్రంప్ ఆ ప్రకటనను 14 **తరువాయి 2లో**

## సునీత, విల్మోర్‌ల తిరుగుప్రయాణానికి
# మార్గం సుగమం

- అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలోకి ప్రవేశించిన క్రూ-10 వ్యోమగాములు

కేప్ కెనావెరాల్: నలుగురు వ్యోమగాములతో నింగిలోకి పయనమైన స్పేస్‌ఎక్స్ వ్యోమనౌక క్రూ డ్రాగన్ ఆదివారం విజయవంతంగా భూకక్ష్యలోని అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్ఎస్)తో అనుసంధానమైంది. దీంతో 9 నెలలుగా అక్కడే చిక్కుకుపోయిన భారత సంతతికి చెందిన సునీతా విలియమ్స్, మరో వ్యోమగామి బుచ్ విల్మోర్‌లు కొద్దిరోజుల్లో భూమికి తిరిగిరావడానికి వీలు కలుగుతుంది. 'క్రూ 10 మిషన్'లో భాగంగా శనివారం అమెరికాలోని కేప్ కెనావెరాల్ అంతరిక్ష కేంద్రం నుంచి క్రూ డ్రాగన్‌లో నలుగురు వ్యోమగాములు నింగిలోకి పయనమైన సంగతి తెలిసిందే. ఇందులో **తరువాయి 2లో**



www.epapersamayam.com APTEL/2006/18267
సమయం
మన గొంతుకే.. మన పత్రిక తెలుగు దినపత్రిక



# అప్రమత్తతే.. శ్రీవారి రక్ష!

(మొదటిపేజీ తరువాయి)

అనధికార పీఆర్వోలుగా చెలామణి అవుతూ అందినకాడికి దోచేస్తున్నారు. ఇదే కోవలో తితిదే వెబ్‌సైట్‌ను పోలిన నకిలీ వెబ్‌సైట్లు ఇంటర్నెట్‌లో ప్రత్యక్షమవుతున్నాయి. వాటిలో టికెట్ బుక్ చేసుకుంటే నగదు పోయినట్లే. ఇంకొందరు ఘరానా మోసగాళ్లు తితిదేను సంప్రదించే భక్తుల వివరాలను తెలుసుకొని.. వారిని ట్రాప్ చేస్తున్నారు. తమను తాము తితిదే సిబ్బందిగా పరిచయం చేసుకొని దర్శనం చేయిస్తామంటూ డబ్బు వసూలు చేస్తున్నారు.

తిరుమల టూటౌన్ పోలీసులు ఇటీవల అరెస్ట్ చేసిన బోయ పవన్‌కల్యాణ్ చేసిన మోసమే అందుకు నిదర్శనం. తాము తితిదే ఛైర్మన్ పీఆర్వోనని, జేఈవో కార్యాలయంలో పని చేస్తున్నానని, తితిదే ఉద్యోగినని సదరు అధికారుల ఫొటోలు తమ వాట్సప్ డీపీలుగా పెట్టుకుని నమ్మిస్తున్నారు. దర్శన టికెట్లు ఇప్పిస్తామంటూ మోసగిస్తున్నారు. తాను తితిదే పీఆర్వోనంటూ పలు వాట్సప్ గ్రూప్‌లకు మెసేజ్‌లు పంపిన ఓ దళారీ ఉచిత శ్రీవారిసేవ స్లాట్‌ను రూ.800 చొప్పున విక్రయించాడు. ప్రజాప్రతినిధులు, తితిదే బోర్డు సభ్యుల పీఆర్వోలుగా చెప్పుకొంటూ కూడా భక్తుల నుంచి నగదు కొట్టేస్తున్నారు.

*** నకిలీ టికెట్లు అంటగడతారు..**

తిరుపతిలోని కొందరు ట్రావెల్స్ యజమానులు, ట్యాక్సీ, ఆటో డ్రైవర్లు భక్తులకు నకిలీ టికెట్లు అంటగడుతున్నారు. శ్రీనివాసం, విష్ణునివాసం, భూదేవి కాంప్లెక్స్‌లలో ఎస్ఎస్‌డీ టోకెన్లు ఇప్పించి దోచుకుంటున్నారు. ఇటీవల జీపు, ఆటోల డ్రైవర్లు చంద్రగిరి నుంచి శ్రీవారి మెట్టు వద్దకు తీసుకువెళ్లి ఉచిత దివ్యదర్శనం టోకెన్లు ఇప్పిస్తానని రూ.వెయ్యి నుంచి రూ.2 వేలు వసూలు చేస్తున్నారు.

*** అధికారులను సంప్రదిస్తే సరి**

భక్తులు తమ సూచనలు పాటిస్తే దళారుల మోసాల నుంచి రక్షణ పొందడంతోపాటు కేటుగాళ్లను పట్టించే అవకాశం ఉంటుందని విజిలెన్స్ వింగ్, తిరుమల పోలీసులు చెబుతున్నారు.

శ్రీవారి దర్శనం, వసతి, ఇతర సౌకర్యాల కోసం ఆన్‌లైన్‌లో తితిదే అధికారిక వెబ్‌సైట్ https://ttdevasthanams.ap.gov.in లోనే నమోదు చేసుకోవాలి. తితి దేవస్థానమ్స్ యాప్ ద్వారా కూడా ఈ సౌకర్యాలు వినియోగించుకోవచ్చు.

* తితిదే అధికారుల అధికారిక ఈమెయిల్ ఐడీలు.. తితిదే ఈవో: eottd@tirumala.org, eottdtpt@gmail.com తితిదే అదనపు ఈవో: jeotml@tirumala.org తిరుపతి జేఈవో: jeotpt@tirumala.orgను సంప్రదించవచ్చు

* వీఐపీ బ్రేక్ దర్శనం సిఫార్సు లేఖలను తితిదే ఛైర్మన్, పాలకమండలి సభ్యులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, తితిదే ఉద్యోగుల వద్ద నేరుగా తీసుకోవడం ద్వారా దళారుల బారిన పడకుండా ఉండొచ్చు.

* శ్రీవారి దర్శనం, వసతి, ఏ ఇతర సందేహాలనైనా నివృత్తి చేసుకునేందుకు టోల్‌ఫ్రీ నంబరు 18004254141 లేదా 155257కు ఫోన్ చేయవచ్చు.

* తిరుమల వన్‌టౌన్ స్టేషన్ 94407 96769

* తిరుమల టూటౌన్ స్టేషన్ 94407 96772

# కేసీఆర్ చిట్టా విప్పుతా

(మొదటిపేజీ తరువాయి)

రూ.5,005 కోట్లు చెల్లించామని, 50 లక్షల పేద కుటుంబాలకు 200 యూనిట్ల విద్యుత్తును ఉచితంగా ఇస్తున్నామని తెలిపారు. రూ.500కే సిలిండర్‌తో పాటు రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్తు అందిస్తున్నామని పేర్కొన్నారు. రైతులకు రూ.20 వేల కోట్ల రుణమాఫీ చేసినట్లు చెప్పారు. నిరుద్యోగ సమస్యను తరిమికొట్టామన్నారు. జనగామ జిల్లా స్టేషన్ ఘన్‌పూర్‌లో ఎమ్మెల్యే కడియం శ్రీహరి అధ్యక్షతన ఆదివారం నిర్వహించిన 'ప్రజాపాలన ప్రగతిబాట' సభకు సీఎం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నియోజకవర్గంలో రూ.630.27 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. అనంతరం బహిరంగ సభలో మాట్లాడారు. ''రాష్ట్రాన్ని కేసీఆర్ అప్పులకుప్పగా మార్చారు. రూ.8.29 లక్షల కోట్ల అప్పును మా నెత్తిమీద పెట్టిపోయారు. ఇందులో రూ.లక్ష కోట్లను ఆయన కుటుంబం దోచుకుంది. గతేడాది రూ.2.91 లక్షల కోట్లతో బడ్జెట్ ప్రవేశపెడితే అంచనాలకు తగ్గ ఆదాయం రాలేదు. అయినా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నాం. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి గురించి ప్రజలకు వాస్తవాలు తెలియాలి. ఎమ్మెల్యేగా 15 నెలలుగా జీతభత్యాలు తీసుకుంటున్న వ్యక్తి బాధ్యత తీసుకోవడం లేదు. ఇది ఇంటర్‌వెల్ మాత్రమే. అసెంబ్లీలో ఈ నెల 19, 20 తేదీల్లో రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై సమగ్ర వివరాలు వెల్లడిస్తాను. కేసీఆర్ చిట్టా విప్పుతాను. పదేళ్లలో కేసీఆర్ సర్కారు చేతికి రూ.10.80 లక్షల కోట్లు వచ్చాయి. వాటితో ఏం చేశారు? రూ.లక్ష కోట్ల వ్యయంతో కాళేశ్వరం ప్రాజెక్టును కట్టారు.. కూల్చారు. అది కాళేశ్వరం కాదు.. కూలేశ్వరం. కాంగ్రెస్ హయాంలో కట్టిన నాగార్జునసాగర్, శ్రీశైలం, శ్రీరామసాగర్, దేవాదుల, ఇందిరా, రాజీవ్ సాగర్‌లు తెలంగాణను సస్యశ్యామలం చేస్తున్నాయి. మహిళలు ఆర్థికంగా ఎదిగేలా ప్రభుత్వం వడ్డీ లేని రుణాలిస్తోంది. సోలార్ ప్లాంట్లు, బస్సుల నిర్వహణను అప్పగిస్తోంది. పాత్రికేయులకు భారాస ప్రభుత్వం పదేళ్లలో ఇవ్వలేని ప్లాట్లు ఇచ్చాం. గ్రూప్1, 2, 3 పరీక్షలను సజావుగా నిర్వహించి ఉద్యోగాలిస్తున్నాం.

# పాక్‌తో శాంతికి యత్నిస్తే ద్రోహం ఎదురైంది

(మొదటిపేజీ తరువాయి)



ప్రయాణం ప్రారంభించాలనే ఉద్దేశంతో 2014లో తన ప్రమాణస్వీకార కార్యక్రమానికి అప్పటి పాక్ ప్రధాని నవాజ్ షరీఫ్‌ను ప్రత్యేకంగా ఆహ్వానించినట్టు తెలిపారు. ప్రస్తుతం పొరుగుదేశ ప్రజలు కూడా శాంతిని కోరుకుంటున్నారని తాను భావిస్తున్నానన్నారు. ఇరుదేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాల మెరుగుకు గతంలో సార్క్ దేశాధినేతలను ఆహ్వానించానని, ఈ పరిణామం శాంతి, సామరస్యం పట్ల మనదేశానికి గల నిబద్ధతను చాటిందని, అయితే ఆశించిన ఫలితం దక్కలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు అమెరికాకు చెందిన కృత్రిమ మేధ (ఏఐ) పరిశోధకుడు లెక్స్ ఫ్రిడ్‌మాన్‌కు ఇచ్చిన పాడ్‌కాస్ట్ ముఖాముఖిలో ప్రధాని మోదీ వెల్లడించారు.

*** దృఢసంకల్పం గల నేత ట్రంప్**

''అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో పరస్పర విశ్వాసం అనే బంధాన్ని పంచుకున్నాను. ఎందుకంటే జాతి ప్రయోజనాలే సర్వోన్నతమని మేమిద్దరం భావిస్తాం. రెండోసారి అధికారంలోకి వచ్చిన ట్రంప్ మదిలో అమెరికా అభివృద్ధిపై స్పష్టమైన రోడ్‌మ్యాప్ ఉంది. హుషారైన, దృఢసంకల్పం గల ట్రంప్‌పై కాల్పులు జరిగిన సమయంలోనూ వాటిని నేను ఆయనలో చూశాను.

*** భారత్-చైనా మధ్య ఆరోగ్యకర పోటీ ఉండాలి**

భారత్‌చైనాల మధ్య వైరుధ్యాల పరిష్కారానికి చర్చలకే మొగ్గు చూపుతా. వాస్తవాధీన రేఖ వెంట 2020 ముందునాటి పరిస్థితులను నెలకొల్పేందుకు రెండు దేశాలు కృషి చేస్తున్నాయి. ఇరు దేశాల మధ్య ఆరోగ్యకరమైన పోటీ ఉండాలని కోరుకుంటున్నాం. అది ఘర్షణకు దారి తీయరాదు.

*** చర్చలతోనే రష్యా-ఉక్రెయిన్ సమస్యకు పరిష్కారం**

రష్యాఉక్రెయిన్ మధ్య చర్చలు సాధ్యమైనప్పుడే వాటి మధ్య గల వివాదానికి పరిష్కారం లభిస్తుంది. యుద్ధక్షేత్రంలో ఎన్నటికీ పరిష్కారం దొరకదు. ఈ వ్యవహారంలో భారత్ తటస్థంగా లేదు. అయితే శాంతికి దృఢంగా కట్టుబడి ఉంది. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, ఉక్రెయిన్ అధినేత వొలోదిమిర్ జెలెన్‌స్కీలతో నాకు సత్సంబంధాలున్నాయి'' అని మోదీ అన్నారు.

*** వివేకానందుడి మాటలే సంఘ్‌లో నేర్పుతారు**

విమర్శ అనేది ప్రజాస్వామ్యానికి ఆత్మవంటిది. నేను విమర్శలను స్వాగతిస్తా. అవి మరింత పదునుగా ఉండాలి. నా శక్తి పేరులో లేదు. 140 కోట్ల మంది భారతీయుల మద్దతు, దేశ సంస్కృతి, వారసత్వంలోనే ఉంది. దేశమే ప్రధానమని ఆరెస్సెస్ బోధిస్తుంది. మానవ సేవే మాధవ సేవ. ఆ గొప్ప సంస్థ నుంచి ఎన్నో విలువలను నేర్చుకున్నా. సంఘ్ (ఆరెస్సెస్) చాలా పెద్ద వ్యవస్థ. వేదాలు, స్వామి వివేకానందుడు చెప్పిన మాటలనే సంఘ్ సభ్యులకు నేర్పిస్తుంటారు.

*** బూట్ల మెరుపు కోసం సుద్ద ముక్కలు**

నా బాల్యం మొత్తం పేదరికంలోనే గడిచింది. నా తెల్ల బూట్లను మెరిపించేందుకు పాఠశాలలో వాడి పడేసిన సుద్ద ముక్కలను సేకరించి తెచ్చుకునేవాడిని. ఓ గొప్ప సత్కార్యం కోసం ఉన్నత శక్తి నన్ను ఇక్కడకు పంపించింది. నేను ఒంటరిని కాదు. నన్ను ఇక్కడికి పంపించిన వారే నాకు తోడుగా ఎల్లప్పుడూ ఉంటారు. మా నాన్న టీ దుకాణానికి వచ్చే వారిని చూసి నేనెంతో నేర్చుకున్నా. వాటినే నా ప్రజా జీవితంలో అమలు చేస్తున్నా.

# అప్పులు.. అవినీతిలో కేసీఆర్‌తో రేవంత్ పోటీ

(మొదటిపేజీ తరువాయి)

మార్పు వచ్చిందా? చెప్పాలి. రేవంత్‌రెడ్డి ఎప్పుడు దిగిపోతారా అని ప్రజలు చూస్తుంటే మరోమారు తాను ముఖ్యమంత్రిని అవుతానని చెబుతున్నారు. ఎవరు వస్తారో ప్రజలు ఇప్పటికే నిర్ణయించుకున్నారు' అని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు.

**అఖిలపక్షంలో తప్పుడు ప్రచారం చేయొద్దు**

తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ ఏర్పాటుచేస్తున్న అఖిలపక్ష సమావేశంపై కిషన్‌రెడ్డి మరోమారు స్పందించారు. 'అఖిలపక్షం పెట్టుకోండి. మాకు ఏ అభ్యంతరం లేదు. కానీ మంచి సలహాలు ఇవ్వండి. తప్పుడు ప్రచారం చేయకండి. లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన, త్రిభాష విధానం, జాతీయ విద్యా విధానం అంశాలపై డీఎంకే, కాంగ్రెస్ పార్టీలు అనుసరిస్తున్న వైఖరి దివాలాకోరుతనంతో కూడింది. దక్షిణ భారతదేశానికి మోదీ ప్రభుత్వం అన్యాయం చేస్తోందంటూ, భాజపా దక్షిణాది రాష్ట్రాల్లో బలహీనంగా ఉన్నందున డీలిమిటేషన్‌లో సీట్లు తగ్గిస్తారంటూ రెండు నెలలుగా స్టాలిన్ వితండవాదం చేస్తున్నారు. దక్షిణాదిలో భాజపా బలంగా ఉంది. పుదుచ్చేరిలో మాదే ప్రభుత్వం, తెలంగాణలో రెండో స్థానంలో ఉన్నాం. కర్ణాటకలో త్వరలో నంబర్‌వన్ అవుతాం. వచ్చే ఏడాది తమిళనాడులో ఎన్నికలు జరగనున్నాయి. డీఎంకే నియంతృత్వ ధోరణిపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉంది. ఓటమి నుంచి తప్పించుకోవడానికే డీఎంకే రాజకీయ నాటకాలు ఆడేందుకు సిద్ధమైంది. తమిళనాడు లిక్కర్ కుంభకోణంలో అనేక మంది డీఎంకే నాయకుల ప్రమేయం ఉంది' అని కిషన్‌రెడ్డి విమర్శించారు.

# నేడు శాసనసభలో రెండు చరిత్రాత్మక బిల్లులు

(మొదటిపేజీ తరువాయి)

ప్రకారం బీసీలతోపాటు కులాలవారీగా జనాభా లెక్కలు వెల్లడయ్యాయి. బీసీల జనాభా ప్రకారం సామాజిక న్యాయం కల్పించేందుకు వారి రిజర్వేషన్లు 42 శాతానికి పెంచాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రస్తుతం రాష్ట్రంలో 29% అమలవుతున్నాయి. ఇందులో బీసీలకు 25%, ముస్లింలకు బీసీఈ కింద 4% ఉంది. 42 శాతానికి పెంచేందుకు బిల్లును ప్రవేశపెట్టనుంది. ఈ నేపథ్యంలో బీసీ ఎమ్మెల్యేలతో మంత్రి పొన్నం ప్రభాకర్ సోమవారం అసెంబ్లీ హాల్‌లో ప్రత్యేకంగా సమావేశం కానున్నారు.

**ఎస్సీ వర్గీకరణకు అంతా సిద్ధం**

ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు వెలువడిన వెంటనే రాష్ట్రంలోనూ వర్గీకరణ అమలు చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. ఈ మేరకు ప్రభుత్వం మంత్రి ఉత్తమ్ ఆధ్వర్యంలో ఉపసంఘాన్ని ఏర్పాటు చేసింది. భవిష్యత్తులో న్యాయ వివాదాలు తలెత్తకుండా ఉండేందుకు ప్రభుత్వం జస్టిస్ షమీమ్ అక్తర్ ఆధ్వర్యంలో ఏకసభ్య కమిషన్‌ను నియమించింది. ఈ కమిషన్ ఫిబ్రవరిలో ఇచ్చిన నివేదికలో ఎస్సీ ఉపకులాలను మూడు గ్రూపులుగా వర్గీకరణ చేయాలని పేర్కొంది. ఈ వివరాలను ప్రభుత్వం అసెంబ్లీలో ప్రకటించింది. అయితే గ్రూపుల వర్గీకరణపై మరికొన్ని కుల సంఘాల నుంచి అభ్యంతరాలు, సూచనలు రావడంతో వాటిని పరిశీలించాలని కమిషన్‌ను సర్కారు కోరింది. వాటిని పరిశీలించిన కమిషన్ తాజాగా ప్రభుత్వానికి నివేదిక ఇవ్వడంతో ఆ మేరకు ఎస్సీ వర్గీకరణ బిల్లు సిద్ధమైంది.

# సునీత, విల్మోర్‌ల తిరుగుప్రయాణానికి మార్గం సుగమం

(మొదటిపేజీ తరువాయి)


అమెరికాకు చెందిన ఆన్ మెక్‌క్లెయిన్, నికోల్ అయర్స్, జపాన్ వ్యోమగామి టకుయా ఒనిషి, రష్యాకు చెందిన కిరిల్ పెస్కోవ్‌లు ఉన్నారు. సునీత, విల్మోర్, భూమికి తిరిగి రానున్న మరో ఇద్దరు వ్యోమగాముల స్థానంలో వీరు ఐఎస్ఎస్‌లో విధులు నిర్వర్తిస్తారు. ఆదివారం ఉదయం 9:37 గంటలకు క్రూ డ్రాగన్ వ్యోమనౌక.. భూమికి 400 కిలోమీటర్ల ఎత్తులోని ఐఎస్ఎస్‌తో విజయవంతంగా అనుసంధానమైంది. అనంతరం విల్మోర్.. అంతరిక్ష కేంద్ర ద్వారాన్ని తెరిచారు. ఆనవాయితీ ప్రకారం వ్యోమనౌక బెల్‌ను మోగించారు. దీంతో క్రూ 10 వ్యోమగాములు నలుగురు.. ఒక్కొక్కరిగా అంతరిక్ష కేంద్రంలోకి ప్రవేశించారు. వీరికి సునీత, విల్మోర్, ఐఎస్ఎస్‌లోని మరో ఐదుగురు వ్యోమగాములు స్వాగతం పలికారు. వారిని ఆత్మీయంగా ఆలింగనం చేసుకున్నారు. ''ఇది అద్భుతమైన రోజు'' అని సునీత పేర్కొన్నారు. వాతావరణం అనుకూలిస్తే బుధవారం సునీత, విల్మోర్, మరో ఇద్దరు వ్యోమగాములతో స్పేస్‌ఎక్స్ క్యాప్సూల్ ఐఎస్ఎస్ నుంచి విడిపోయి.. భూమికి పయనమయ్యే అవకాశం ఉంది. ఈ వ్యోమనౌక ఫ్లోరిడా తీరానికి చేరువలో సాగరజలాల్లో దిగుతుంది. సునీత బృందం తిరుగుప్రయాణమయ్యే వరకూ ఐఎస్ఎస్‌లో 11 మంది వ్యోమగాములు ఉంటారు.


*** అదనపు చెల్లింపులు నామమాత్రమే**

సుదీర్ఘ కాలం అంతరిక్షంలోనే ఉండిపోయినందుకు సునీత, విల్మోర్‌లకు అదనంగా ప్రత్యేక వేతనాన్ని చెల్లించే అవకాశం లేదని అమెరికా అంతరిక్ష సంస్థ నాసా విశ్రాంత వ్యోమగామి క్యాడీ కోల్‌మన్ పేర్కొన్నారు. ఈ వ్యోమగాములిద్దరూ ఫెడరల్ ఉద్యోగులు అయినందువల్ల.. అంతరిక్షంలో వారు పనిచేసిన కాలాన్ని భూమ్మీద సాధారణ పర్యటన చేసినట్లుగానే పరిగణిస్తారని చెప్పారు. సాధారణంగా వచ్చే జీతంతోపాటు ఐఎస్ఎస్‌లో ఆహారం, బస ఖర్చులను నాసా భరిస్తుందన్నారు. ఇటువంటి అనూహ్య పరిణామాలు చోటు చేసుకున్నప్పుడు మాత్రం అదనంగా రోజుకు నాలుగు డాలర్ల (సుమారు రూ.348) భత్యం మాత్రమే వచ్చే అవకాశం ఉందని తెలిపారు. 2010 11లో మిషన్‌లో భాగంగా 159 రోజులపాటు ఐఎస్ఎస్‌లో ఉన్నానని, అందుకు మొత్తంగా 636 డాలర్లు మాత్రమే తనకు అదనంగా చెల్లించారన్నారు. ఈ లెక్కన సునీత, విల్మోర్‌లకు తొమ్మిది నెలలకు గాను దాదాపు 1100 డాలర్లు (సుమారు రూ.లక్ష) మాత్రమే అదనంగా పొందే అవకాశం ఉందని తెలుస్తోంది. నాసా ఉద్యోగులకు అమెరికా ప్రభుత్వ ఉద్యోగుల తరహా జీతభత్యాలే అందుతాయి. సునీత, విల్మోర్‌లు అత్యధిక గ్రేడ్ జీఎస్15 గ్రేడ్ పే జీతం అందుకుంటున్నారు. వీరి వార్షిక వేతనం 1,24,133 డాలర్ల నుంచి 1,62,672 డాలర్ల (సుమారు రూ.1.08 కోట్ల నుంచి రూ.1.41కోట్లు) మధ్యన ఉంటుందని సమాచారం.

# ఈశాన్య రాష్ట్రాల్లో కొత్త 'నేర'చట్టాల అమలుపై అమిత్ షా సమీక్ష

(మొదటిపేజీ తరువాయి)





అధీనియం (బీఎస్ఏ) చట్టాల అమలుపై ఆయా రాష్ట్రాలు హోంమంత్రి సమక్షంలో ప్రెజెంటేషను ఇచ్చాయి. కొత్త నేర న్యాయ చట్టాలపై అస్సాం ప్రభుత్వం ప్రచురించిన పుస్తకాన్ని ఈ సందర్భంగా అమిత్ షా ఆవిష్కరించారు. 7 రాష్ట్రాల ముఖ్యమంత్రులు హిమంత బిశ్వశర్మ (అస్సాం), కాన్రాడ్ కె.సంగ్మా (మేఘాలయ), నెఫ్యూ రియో (నాగాలాండ్), పేమా ఖండూ (అరుణాచల్ ప్రదేశ్), మాణిక్ సాహా (త్రిపుర), లాల్దూహోమా (మిజోరం), ప్రేమ్‌సింగ్ తమాంగ్ (సిక్కిం)తోపాటు చీఫ్ సెక్రటరీలు, అయిదుగురు డీజీపీలు, కేంద్రం నుంచి పలువురు ఉన్నతాధికారులు హాజరయ్యారు. మణిపుర్‌లో రాష్ట్రపతి పాలన ఉన్నందున ఆ రాష్ట్రం నుంచి గవర్నర్ అజయ్‌కుమార్ భల్లా విచ్చేశారు.

**బోడో ఒప్పందాన్ని ఎగతాళి చేసిన కాంగ్రెస్**

అస్సాం ప్రాంతానికి శాంతిని, ప్రగతిని తీసుకొచ్చిన బోడో ఒప్పందాన్ని కాంగ్రెస్ పార్టీ ఎగతాళి చేసిందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా అన్నారు. బోడోల్యాండ్ టెరిటోరియల్ రీజియన్ (బీటీఆర్) యువత చేతిలో ఇపుడు తుపాకులకు బదులుగా త్రివర్ణ పతాకం ఉందన్నారు. 2020 జనవరిలో ఒప్పందంపై సంతకం చేయడం వల్లే ఇది సాధ్యమైనట్లు తెలిపారు. కోక్రాఝార్ జిల్లాలోని డాట్మాలో ఆదివారం 'ఆల్ బోడో స్టూడెంట్స్ యూనియన్' (ఏబీఎస్‌యూ) 57వ వార్షిక సమావేశంలో అమిత్ షా మాట్లాడారు.

# ట్రంప్ దూకుడుకు న్యాయస్థానం కళ్లెం

(మొదటిపేజీ తరువాయి)

రోజుల పాటు నిలుపుదల చేశారు. వలసదారులను విమానాల్లో తరలించారని తాను విన్నానని.. వెంటనే వాటిని వెనక్కి మళ్లించాలని జడ్జి పేర్కొన్నట్లు 'వాషింగ్టన్ పోస్ట్' పత్రిక ప్రచురించింది. 1798 చట్టం ప్రకారం.. యుద్ధ సమయాల్లో దేశ రక్షణకు ముప్పు కలిగించే ఇతర దేశ ప్రజలను నిర్బంధించి.. బహిష్కరించొచ్చు. చివరిసారిగా రెండో ప్రపంచయుద్ధ సమయంలో జపాన్ ప్రజలపై ఈ చట్టాన్ని అమలు చేశారు. మళ్లీ ఇప్పుడు ట్రంప్ శనివారం వెనెజువెలా వలసదారులపై ప్రయోగించారు. ఈ చట్టాన్ని వినియోగిస్తానని గతేడాది ఎన్నికల ప్రచారంలోనూ ట్రంప్ తెలిపారు. న్యాయస్థానంలో వాదనల సందర్భంగా.. చట్టంలోని దండయాత్ర, చొరబాటు పదాలు.. శత్రు దేశాలు చేసే శత్రు చర్యలకు సంబంధించినవని, ఇవి ట్రంప్ ప్రకటనకు ఆధారం కాబోవని న్యాయమూర్తి పేర్కొనట్లు 'న్యూయార్క్ టైమ్స్' పత్రిక తెలిపింది. ఇప్పుడిక ఈ కేసు చట్టంలోని అన్ని వ్యవస్థలను దాటుకొని సుప్రీంకోర్టుకు వెళ్లే అవకాశం ఉంది.

# ఆంధ్రా ఆసుపత్రిలో తల్లిపాల బ్యాంకు

(మొదటిపేజీ తరువాయి)

బ్యాంకును ఆదివారం ఆమె ప్రారంభించారు. అనంతరం సర్వైకల్ క్యాన్సర్ నివారణకు బాలికలకు హెచ్‌పీవీ వ్యాక్సిన్ వేసే శిబిరాన్ని ప్రారంభించారు. ఏడాదికి 1500 మందికి ఉచితంగా ఈ టీకాలు వేస్తారని చెప్పారు. ఈ సందర్భంగా మహేష్‌బాబు ఫౌండేషన్ ఆధ్వర్యంలో గుండె శస్త్రచికిత్సలు చేయించుకున్న చిన్నారులు, వారి తల్లిదండ్రులతో ముచ్చటించారు. పదేళ్లలో 4,500కు పైగా గుండె శస్త్రచికిత్సలు చేశారని, అందుకు మహేష్‌బాబు ఫౌండేషన్ సాయం చేసిందని వెల్లడించారు. వైద్యులు పి.వి.రమణమూర్తి, పి.వి.రామారావు, పద్మ, విక్రమ్ తదితరులను అభినందించారు.

# పార్లమెంట్, అసెంబ్లీల్లో అరకు కాఫీ స్టాల్స్




విశాఖపట్నం: పార్లమెంట్ ప్రాంగణంలో అరకు కాఫీ స్టాల్ ఏర్పాటుకు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా ఇటీవల అనుమతించిన నేపథ్యంలో సోమవారం నుంచి పార్లమెంట్ క్యాంటీన్‌లో రెండుచోట్ల తాత్కాలికంగా స్టాళ్లను నిర్వహించడానికి ఏర్పాట్లు చేసినట్లు గిరిజన సహకార సంస్థ (జీసీసీ) అధికారులు వెల్లడించారు. కేంద్ర మంత్రులకు ఇవ్వడానికి ప్రత్యేకంగా అరకు కాఫీ గిఫ్ట్ ప్యాక్‌లనూ సిద్ధం చేశారు. ప్రధాని మోదీతో పాటు ప్రముఖులందరికీ వీటిని పార్లమెంటు ఆవరణలో అందించాలని భావిస్తున్నారు. ఈ నెల 28 వరకు అసెంబ్లీ సమావేశాలు జరగనున్నందున అక్కడ కూడా ఒకటి, రెండు రోజుల్లో స్టాల్ ఏర్పాటు చేయాలని అధికారులు భావిస్తున్నారు. ఈ మేరకు గిరిజన సంక్షేమశాఖ మంత్రి సంధ్యారాణితో జీసీసీ ఎండీ కల్పనాకుమారి మాట్లాడారు.

# పొట్టి శ్రీరాములు త్యాగనిరతి స్ఫూర్తిదాయకం

* **అమరజీవి పొట్టి శ్రీరాములుకు శ్రీ విజయ్‌కుమార్ నివాళులు**

ఆంధ్రులకు ప్రత్యేక రాష్ట్రం కోసం ఆత్మార్పణం చేసిన పొట్టి శ్రీరాములు దృఢసంకల్పం, త్యాగనిరతి ఎప్పటికీ స్ఫూర్తిదాయకమని లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడుశ్రీ విజయ్‌కుమార్ G Srkr IAS(R) గారు కొనియాడారు. అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా ఆయన సేవలను శ్రీ విజయ్ కుమార్ గారు స్మరించుకున్నారు. ఆయన జీవితం ఎందరికో ఆదర్శమన్నారు. ప్రజల మేలు కోసం చివరివరకు



పోరాడిన మహనీయుడు పొట్టి శ్రీరాములు అని శ్రీ విజయ్‌కుమార్ గుర్తు చేసుకున్నారు. ఈ మేరకు తన ఎక్స్ ఖాతాలో శ్రీ విజయ్‌కుమార్ గారు సందేశం పోస్టు చేశారు.

# స్వచ్ఛ సర్వేక్షన్-2024 లో మెరుగైన ర్యాంకు సాధనకు కృషి చేయాలి

: **నగర మేయర్ శ్రీమతి గుండు సుధారాణి**

- **ఓ డి ఎఫ్ + + దక్కేలా చర్యలు చేపట్టాలని ఆదేశం....**
- **నగరం లో టాయిలెట్ ల పనితీరు క్షేత్ర స్థాయి లో పరిశీలన....**

**వరంగల్ కార్పొరేషన్ మార్చి16** : స్వచ్ఛ సర్వేక్షన్2024 లో మెరుగైన ర్యాంకు సాధనకు కృషి చేయాలని నగర మేయర్ శ్రీమతి గుండు సుధారాణి అన్నారు. ఆదివారం నగరం లోని బల్దియా ప్రధాన కార్యాలయం లో గల షీ టాయిలెట్ తో పాటు హన్మకొండ లోని డి ఈ ఓ కార్యాలయం వద్ద గల పబ్లిక్ టాయిలెట్ అదాలత్ వద్ద గల పబ్లిక్ టాయిలెట్ లను క్షేత్ర స్థాయి లో పరిశీలించి నిర్వహణ తీరును ఏం హెచ్ ఓ ను అడిగి తెలుసుకొని సమర్థవంతంగా నిర్వహించుటకు తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ స్వచ్ఛ సర్వేక్షన్2024 లో నగరానికి మరో మారు ఓ డి ఎఫ్ + + సర్టిఫికెట్ సాధించేలా ప్రజా మరుగు దొడ్ల నిర్వహణ ఉండాలని నగర వ్యాప్తం గా




ఉన్న పబ్లిక్ టాయిలెట్ లలో ఏమైనా మరమత్తులు అవసరం ఐతే వెంటనే చేపట్టి వినియోగం లోకి తేవాలని అదాలత్ వద్ద గల ప్రజా మరుగుదొడ్డి నీరు లేక పనిచేయడం లేదని తెలుపగా బోర్ వేయించి నీటి సరఫరా కల్పించి పనిచేసేలా చూడాలని గ్రేటర్ వరంగల్ కార్పొరేషన్ అనే నామ ఫలకం (నేమ్ ప్లేట్)తో పాటు స్వచ్ఛ సర్వేక్షన్ సంబంధిత అంశాలు స్పష్టం గా కనిపించేలా పెయింట్ వేయించిరాయించాలని అన్నారు. పబ్లిక్ టాయిలెట్ల పైన ఉన్న అడ్వేర్టైజ్మెంట్ బోర్డ్ లపై ప్రాపర్టీ టాక్స్, ఎల్ ఆర్ ఎస్, స్వచ్ఛ సర్వేక్షన్ ను సంబంధించిన సమాచారం ప్రజలకు తెలిసేలా ప్రదర్శించాలని మేయర్ అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంహెచ్ఓ డా.రాజేష్ తదితరులు పాల్గొన్నారు

# భ్రమరాంబికా నగర్ లో నాలా పనుల పరిశీలన 38 లక్షల రూపాయలతో రోడ్డు పునరుద్ధీకరణ

**హైదరాబాద్ మార్చి16 ( సమయం న్యూస్) :** మల్కాజిగిరి డివిజన్ భ్రమరాంబికా నగర్ లో మల్కాజిగిరి కార్పొరేటర్ శ్రవణ్ పర్యటించడం జరిగింది. ఈ సందర్భంగా నాలా పనులను పరిశీలించడం జరిగింది. పనులలో నాణ్యత పాటించాలని, ప్రజల సౌకర్యం కోసం డ్రైనేజీ కనెక్షన్స్ ఇవ్వాలని అధికారులకు సూచించడం జరిగింది. అదే విధంగా దాదాపు 38 లక్షల రూపాయల తో రోడ్డు పునరుద్దికరణ చెప్పటానున్నామని తెలిపారు. ఎక్కువుగా పెరిగి తీగల పైకి వస్తున్న చెట్ల కొమ్మలను ట్రిమ్మింగ్ చెయ్యాలని కోరడం జరిగింది. ఈ కార్యక్రమం లో అశోక్, నర్సింహా,ప్రదీప్, నాని, చారీ, విజయ్, మహేందర్, పవన్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



# ప్రజా నాయకుడికి నిలువెత్తు రూపం ఎర్రబెల్లి దయన్న

* **ఈరోజు 46 వివాహాలకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించిన - మాజీ మంత్రి ఎర్రబెల్లి**

**వరంగల్మార్చి16 (సమయంన్యూస్)** : ఉమ్మడి వరంగల్ జిల్లా, పర్వతగిరి, వర్ధన్నపేట, జనగామ జిల్లా: పాలకుర్తి నియోజకవర్గం; దేవరుప్పుల,పాలకుర్తి,తొర్రూరు,రాయపర్తి,పెద్దవంగర మండలాలలో పర్యటించి నూతన వధూవరులను ఆశీర్వదించిన రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి & ఆర్



డబ్ల్యూ ఎస్ శాఖ మాజీ మంత్రి వర్యులు ఎర్రబెల్లి దయాకర్ రావు ఈ సందర్భంగా వారు వధూవరులకు సంతోషకరమైన వైవాహిక జీవితం కోరుతూ..వారి భవిష్యత్తు ఉజ్వలంగా సుఖ సంతోషాలతో ఉండాలని అక్షింతలు వేసి ఆకాంక్షించారు .





# రాజీవగాంధీ నగర్ వాసుల తో కలిసి ఎం. పి శ్రీ ఈటల రాజేందర్ ని కలిసిన కార్పొరేటర్ శ్రవణ్

* **పవర్ బోర్లు మరియు రైల్వే వివాదాలపై వినతి.**

మల్కాజిగిరి కార్పొరేటర్ శ్రవణ్, రాజీవ్ గాంధీ నగర్ వాసులతో కలిసి ఆదివారం ఎం. పి శ్రీ ఈటల రాజేందర్ ని కలిశారు. ఈ సందర్భంగా రాజీవగాంధీ నగర్, బజరంగ్ స్టోర్స్ వద్ద వేసిన రోడ్లు, బాక్స్ డ్రైన్ పై ధన్యవాదాలు తెలిపారు. అదే విధంగా రైల్వే వివాదల్లో ఉన్నరాజీవ్ గాంధీనగర్ కు అండగా ఉండాలని కోరగా, వెంటనే సదరు రైల్వే అధికారులతో ఎం. పి గారు మాట్లాడారు. తప్పకుండ రాజీవగాంధీనగర్‌కు అండగా ఉంటామని అన్నారు. మల్కాజిగిరి ప్రాంతంలోని కాలనీ లకు పలు పవర బోర్లకు నిధులు ఇస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమం లో రాజీవ్ గాంధీ నగర్ వాసులు యాకుబ్ రెడ్డి, ప్రదీప్, మహేందర్, మౌనిష్, ఇంటి యజ్, పవన్, అశోక్, చారీ, నాని, చెన్నా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# కార్పొరేటర్ ఇ.విజయ్ కుమార్ గౌడ్ కాలనీలో పర్యటన

**అంబర్‌పేట, మార్చి,16, సమయం న్యూస్:** అంబర్ పేట డివిజన్ ఎంసిహెచ్ కాలనీలో ప్రజా సమస్యలు తెలుసుకునేందుకు ఉదయాన్నే పర్యటించిన అంబర్ పేట డివిజన్ కార్పొరేటర్ ఈ విజయ్ కుమార్ గౌడ్. ఈ సందర్భంగా కార్పొరేటర్ స్థానిక కాలనీ ప్రజలతో కలిసి mch కాలనీలో లోప్రెషర్ తో మంచినీరు సరఫరా అవుతుండడం గమనించి, వెంటనే సంబంధిత అధికారులకు సిబ్బందికి తెలియజేసి వెంటనే సమస్యని పరిష్కరించాలని, వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని ఎక్కడ నీటి సమస్య లేకుండా చూడాలని తెలియజేశారు. కాలనీలో ప్రతి వీధిలో స్థానిక కాలనీవాసులతో తిరిగి సమస్యలను తెలుసుకొని పరిష్కరించే దిశగా అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు స్థానిక బస్తీ ప్రజలు అన్వేష్,వెంకటేష్, ఆనంద్, ప్రసాద్,భారతి, వెంకటేశ్వ రెడ్డి, శారద, సంతోష్, లైన్ మెన్ అనిల్, తదితరులు పాల్గొన్నారు.





# అసెంబ్లీ స్పీకర్ పై బిఆర్ఎస్ పార్టీ అనుచిత వ్యాఖ్యలు సిగ్గుచేటు

* **జగదీశ్వర్ రెడ్డి, కేటీఆర్ సభ్యత్వాన్ని రద్దు చేయాలి**
* **డిసిసి అధ్యక్షుడు తూముకుంట నర్సారెడ్డి**

**గజ్వేల్, (సమయంన్యూస్):** దళితుడైన అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ పై శాసనసభలో అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్యే జగదీశ్వర్ రెడ్డిలను వెంటనే శాసనసభ సభ్యత్వాన్ని రద్దు చేయాలని డిసిసి అధ్యక్షుడు తూముకుంట నర్సారెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. శనివారం బి ఆర్ ఎస్ ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి, ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ దిష్టిబొమ్మలను గజ్వేల్ ఇందిరా పార్క్ చౌరస్తా, వర్గల్ మండల కేంద్రాల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు దహనం చేశారు. ఈ సందర్భంగా డిసిసి అధ్యక్షుడు, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూముకుంట నర్సారెడ్డి మాట్లాడుతూ శాసనసభలో అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ పై ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి ఏకవచనంతో




మాట్లాడుతూ ఆగౌరవపరిచి, శాసనసభ సంప్రదాయాలను తుంగలో తొక్కినందుకు, జగదీష్‌రెడ్డికి మద్దతుగా నిలిచిన బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ దిష్టిబొమ్మలను దహనం చేశామని తెలిపారు. బిఆర్ఎస్ అధినేత కెసిఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ లకు ఆ పార్టీకే దళితులంటే చిన్నచూపని అన్నారు. రాష్ట్రం ఏర్పాటు కాగానే దళిత ముఖ్యమంత్రిని చేస్తామని మోసం చేశారని, మంత్రి రాజయ్యను కూడా బర్తరఫ్ చేశారని గుర్తు చేశారు. దళితుడైన గడ్డం ప్రసాద్ శాసనసభ స్పీకర్ గా కాంగ్రెస్ పార్టీ నియమిస్తే అధ్యక్షా అని సంబోధించాల్సి వస్తుందని కెసిఆర్ శాసనసభ సమావేశాలకు హాజరు కావడం లేదని తెలిపారు. స్పీకర్ పై అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు జగదీశ్ రెడ్డి ని అసెంబ్లీ నుండి బహిష్కరించడమే కాకుండా అతని యొక్క సభ్యత్యాన్ని రద్దు చేయాలని ఈ సందర్భంగా కోరారు. కెసిఆర్ ప్రభుత్వం అందిస్తున్న జీతభత్యాలను తీసుకుంటూ ప్రజల సమస్యలను పరిష్కరించడం లేదని ఆరోపించారు. గజ్వేల్ ప్రజలు మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిపించి రెండుసార్లు సీఎం గా మూడోసారి ప్రతిపక్ష నాయకుడిగా హోదా కట్టబెట్టినా కూడా ప్రజల్లోకి వచ్చి సమస్యలు పరిష్కరించకుండా ఫామ్ హౌస్ లోనే తాగి పడుకుంటున్నారని ఆరోపించారు. ఇప్పటివరకు 57 లక్షల జీతభత్యాలను ఎమ్మెల్యేగా కెసిఆర్ తీసుకున్నారని ఎమ్మెల్యేగా బాధ్యతలు తీసుకున్న ఒక్కసారి కూడా ప్రజా సమస్యలను పట్టించుకోలేదని ప్రజలను కలవలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఏఎంసి చైర్మన్ వంటేరు నరేందర్ రెడ్డి, ఏం సి వైస్ చైర్మన్ సర్దార్ ఖాన్, మాజీ మున్సిపల్ చైర్మన్ గాడి పల్లి భాస్కర్, నాయకులు సాజిద్, సుఖేందర్ రెడ్డి శ్రీనివాస్ రెడ్డి, లక్ష్మారెడ్డి నక్క రాములు గౌడ్, అజహర్, రమేష్ గౌడ్, రాములు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

www.epapersamayam.com APTEL/2006/18267
సమయం
మన గొంతుకే.. మన పత్రిక తెలుగు దినపత్రిక



# వాటర్ ట్యాంక్ పైప్ లైన్ లీకేజీ

* **పట్టించుకోని అధికారులు. వృధాగా పోతున్న భగీరథ నీరు**

రాయపోల్, మార్చి 16, సమయం న్యూస్ : గత కొన్ని రోజులుగా వాటర్ ట్యాంక్ పైప్లైన్ లీకేజీ అవుతున్న ఎవరూ పట్టించుకోవడం లేదు. అసలే ఎండాకాలం కావడంతో నీటి కోసం కాలనీ వాసులకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండల కేంద్రం రాయపోల్ ఎస్సీ కాలనీలోని వినాయకుడి గుడి దగ్గర ట్యాంక్ నుండి క్రిందికి వెళ్లే పైప్ లైన్ మధ్యలో లీక్ అవుతూ ట్యాంకు లోని మొత్తం నీరు వృధాగా పోతుంది. కాలనీవాసుల అవసరాలు తీర్చడానికి ట్యాంక్ లో వాటర్ లేకపోవడంతో ప్రజల తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.



ఈ సమస్య అధికారుల దృష్టికి తీసుకెళ్లిన ఫలితం లేకుండా పోయింది. ఇప్పటికైనా అధి కారులు స్పందించి వాటర్ ట్యాంక్ పైప్లైన్ కు మరమ్మత్తులు చేసి ఈ సమస్యను పరిష్కరించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

# హామీలు అమలు చేస్తారా.. గద్దె దిగుతారా

: **కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించిన ఎంపీ రఘునందన్ రావు**

**గజ్వేల్, మార్చి16, సమయం న్యూస్:** అబద్ధపు హామీలతో ప్రజలను మోసం చేసి అధికారం చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం హామీలు అమలు చేస్తారా లేక గద్దె దిగుతారా అంటూ మెదక్ ఎంపీ రఘునందన్ రావు ప్రశ్నించారు. ఆదివారం గజ్వేల్ లో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎన్నికలకు ముందు కేసీఆర్ నుండి లక్ష కోట్లు కక్కిస్తామని, రేవంత్ రెడ్డి చెబితే నమ్మరని రాహుల్ గాంధీతో



చెప్పించారని, ఇంకా ఎన్నో హామీలు ఇచ్చారని, ఇప్పుడు ఖజానా ఖాళీగా ఉందని చెబుతారా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. పెనం నుంచి పొయ్యిలో పడినట్లు తెలంగాణ రాష్ట్ర ప్రజల పరిస్థితి దాపురించిందన్నారు. వెంటనే ప్రజలకు అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని లేనిపక్షంలో గద్దె దిగాలని కాంగ్రెస్ ప్రభుత్వానికి ఎంపీ రఘునందన్ రావు సూచించారు. సమావేశంలో బిజెపి జిల్లా అధ్యక్షుడు బైరి శంకర్ ముదిరాజ్, బిజెపి రాష్ట్ర నాయకులు కప్పర ప్రసాద్, సీనియర్ నాయకులు జశ్వంత్ రెడ్డి, ఉప్పల మధుసూదన్, పట్టణ మండల అధ్యక్షులు మనోహర్ యాదవ్ అశోక్ గౌడ్, నాయకులు నాయిని సందీప్, శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# బ్రాహ్మణ సంఘం నిర్మాణానికి రూ. 10 లక్షల నిధులు

* **గజ్వేల్ లో విశ్వా వసు పంచాంగ ఆవిష్కరణ చేసిన ఎంపీ రఘునందన్ రావు**

**గజ్వేల్, మార్చి 16, సమయం న్యూస్ :** గజ్వేల్ బ్రాహ్మణ సంఘ భవన నిర్మాణానికి ఎంపీ నిధులు రూ. 10 లక్షలు అందించనున్నట్లు మెదక్ ఎంపీ రఘునందన్ రావు హామీ ఇచ్చారు. ఆదివారం గజ్వేల్ లోని సత్యసాయి మందిరంలో బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య ఆధ్వర్యంలో యాయవరం చంద్రశేఖర శర్మ సిద్ధాంతి గనించిన విశ్వావసు నామ సంవత్సర పంచాంగాన్ని ఎంపీ రఘునందన్ రావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైందవ ధర్మాన్ని కాపాడుతున్న బ్రాహ్మణులకు తన వంతు సేవ చేసుకోవడానికి ఎల్లవేళలా సిద్ధంగా ఉంటానన్నారు. గజ్వేల్ డివిజన్ బ్రాహ్మణ సంఘం భవన నిర్మానానికి ప్రణాళికలు సిద్ధం చేయించి తనను సంప్రదిస్తే రూ. 10 లక్షల ఎంపీ నిధులను మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. రాబోయే తెలుగు సంవత్సర పంచాంగంలో తనకు ఆదాయం కన్నా ఖర్చు ఎక్కువ ఉందని త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు ఉన్నందున ఖర్చు పెట్టాల్సి ఉంటుందని అంటూ అందరినీ నవ్వించారు. బిజెపి రాష్ట్ర నాయకులు కప్పర ప్రసాద్ మాట్లాడుతూ హైందవత్వానికి పంచాంగమే మూలమని, పంచాంగం ద్వారా లెక్కించే మహాకుంభమేళా లాంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని గుర్తు చేశారు. పంచాంగాలు మూఢనమ్మకాలు అనేవారి మాటలు తప్పని ఎన్నో శాస్త్రీయ



ఆధ్యాత్మిక ఆధారాలు ఉన్నాయన్నారు. ఈ సందర్భంగా బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య డివిజన్ అధ్యక్షులు దేశపతి శంకర శర్మ, సంఘం ప్రతినిధులు ఎంపీ రఘునందన్ రావుని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో దర్శనం ఆధ్యాత్మిక మాసపత్రిక ఎడిటర్ మరుమాముల వెంకటరమణ శర్మ, బిజెపి జిల్లా అధ్యక్షులు బైరి శంకర్, ప్రధాన కార్యదర్శి రవీందర్ రావు, కోశాధికారి కృష్ణమూర్తి శర్మ, యువ పరిషత్ సాయి కృష్ణ శర్మ, శ్యామ్ ప్రసాద్ శర్మ, మాముదాల రాఘవేందర్ రావు, గజ్వేల్ బిజెపి నాయకులు, బ్రాహ్మణులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.





## ఆమె నీటిలో మునిగిపోయిందా..?
# సముద్రం వద్ద సుదీక్ష కోణంకి దుస్తులు

డొమినికన్ రిపబ్లిక్లో అదృశ్యమైన భారత సంతతి విద్యార్థిని సుదీక్ష కోణంకి కేసు మిస్టరీగా మారింది. తన ఆచూకీ కోసం పోలీసులు గాలింపు జరుపుతున్నారు. ఈ క్రమంలోనే ఆమె దుస్తులు బీచ్ వద్దనున్న లాంజ్ కుర్చీలో ఉన్నట్లు కొన్ని దృశ్యాలు తాజాగా బయటకొచ్చినట్లు మీడియా కథనాలు వెలువడ్డాయి. సుదీక్ష దుస్తులు కొన్ని మట్టిలో కూరుపోయినట్లు గుర్తించారు. ఆమె నీటిలోకి వెళ్లే ముందు వాటిని అక్కడ వదిలి ఉండొచ్చని అనుమానిస్తున్నారు. ఆమె చివరి సారిగా ధరించిన దుస్తులు ప్రస్తుతం వీటితో సరిపోలాయి. కాగా.. వర్జీనియాకు చెందిన 20 ఏళ్ల సుదీక్ష కోణంకి ఇటీవల మరో ఐదుగురు అమ్మాయిలతో కలిసి డొమినికన్ రిపబ్లిక్లోని ప్రముఖ పర్యటక పట్టణమైన ప్యూంటా కానా ప్రాంతానికి వెకేషన్కు వెళ్లిన సంగతి తెలిసిందే. మార్చి 6వ తేదీన స్థానికంగా ఉన్న రియూ రిపబ్లికా రిసార్ట్ బీచ్ వద్ద చివరిసారిగా కన్పించింది. ఆ తర్వాత ఆమె గదికి తిరిగి రాకపోవడంతో స్నేహితులు పోలీసులను సంప్రదించారు. నాటి నుంచి ఆమె కోసం గాలిస్తున్నారు. సీసీటీవీ దృశ్యాలను పరిశీలించగా.. మార్చి 6వ తేదీ తెల్లవారుజామున 3 గంటల వరకు సుదీక్ష ఆమె స్నేహితులతో కలిసి రిసార్ట్లో పార్టీ చేసుకున్నట్లు పోలీసులు గుర్తించారు. ఆ తర్వాత ఆమె ఐయోవాకు చెందిన 24 ఏళ్ల టూరిస్టు జాషువా స్టీవెన్ రిబెతో కలిసి బీచ్కు వెళ్లినట్లు తేలింది. దీంతో పోలీసులు అతడిని ప్రశ్నించగా.. పొంతన లేని సమాధానాలు చెబుతున్నాడు. తమ కుమార్తెను ఎవరైనా కిడ్నాప్ చేసి ఉంటారని సుదీక్ష తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. ఆ కోణంలో కూడా దర్యాప్తు చేపట్టాలని పోలీసులను అభ్యర్థించారు. ఈ క్రమంలోనే ఆమె దుస్తులు బీచ్ వద్ద కనిపించాయి.

# రూ.75కోట్ల డ్రగ్స్ స్మగ్లింగ్లో విదేశీ మహిళల అరెస్టు..
# బెంగళూరు, ముంబయికి 59 ట్రిప్పులు!

బెంగళూరు: కర్ణాటకలో భారీగా మాదకద్రవ్యాలను పోలీసులు సీజ్ చేశారు. డ్రగ్స్ అక్రమరవాణా చేస్తూ పట్టుబడిన ఇద్దరు విదేశీ మహిళలను అరెస్టు చేశారు. బెంగళూరు విమానాశ్రయంలో వీరి నుంచి రూ.75 కోట్ల విలువైన 37 కిలోల మాదకద్రవ్యాలను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన మహిళలను నైజీరియాకు చెందిన బాంబా ఫాంటా (31), అబిగైల్ అడోనిస్ (30)గా గుర్తించారు. ఢిల్లీ నుంచి ఎండీఎంఏను ట్రాలీ బ్యాగుల్లో తరలిస్తుండగా వీరిని అదుపులోకి తీసుకున్నట్లు మంగళూరు పోలీస్ కమిషనర్ అనుపమ్ అగర్వాల్ మీడియాకు వెల్లడించారు. అలాగే, వీరి నుంచి మొబైల్ ఫోన్లు, పాస్పోర్టులతో పాటు రూ.18వేల నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. వీరిద్దరూ ఢిల్లీలో నివాసం ఉంటూ దేశ వ్యాప్తంగా డ్రగ్స్ అక్రమ రవాణాకు పాల్పడుతున్నట్లుగా పోలీసులు గుర్తించారు. విమానాల్లో ప్రయాణిస్తూ డ్రగ్స్ను పలు ప్రాంతాలకు రవాణా చేస్తున్నారని.. ఏడాది కాలంలో ముంబయికి 37 సార్లు, బెంగళూరుకు 22సార్లు విమాన ప్రయాణాలు చేసినట్లు పోలీసులు వివరించారు. 2020లో ఫాంటా అనే మహిళ బిజినెస్ వీసాపై భారత్కు రాగా.. 2016 నుంచే అడోనిస్ భారత్లో ఉంటున్నట్లు తెలిపారు. గత రెండేళ్లుగా






వీరిద్దరూ డ్రగ్స్ ముఠాలో భాగస్వాములయ్యారని అగర్వాల్ తెలిపారు. ఆరు నెలల క్రితం మంగళూరులో 15 గ్రాముల ఎమ్డీఎమ్ఏతో హైదర్ అలీ అనే వ్యక్తిని పోలీసులు పట్టుకున్నారు. అదే విధంగా అంతకు ముందు బెంగళూరులో మరో వ్యక్తి ఆరు కిలోల ఎమ్డీఎమ్ఏతో అధికారుల చేతికి చిక్కాడు. దీనిలో భాగమైన మిగిలిన వారిని కూడా గుర్తించేందుకు పోలీసులు ప్రత్యేక ఆపరేషన్ ప్రారంభించారు.

# అమెరికా దాడుల వేళ.. ఈజిప్టులోకి హూతీల క్షిపణి!


హూతీ తిరుగుబాటుదారులపై అమెరికా ఉక్కుపాదం మోపిన విషయం తెలిసిందే. యెమెన్లో చేపట్టిన దాడుల్లో 30 మందికిపైగా మృతి చెందారు. ఇదే సమయంలో హూతీలు ప్రయోగించినట్లు భావిస్తున్న ఓ క్షిపణి ఈజిప్టును తాకినట్లు తెలుస్తోంది. సినాయ్ ద్వీపకల్పంలోని తీరప్రాంత నగరమైన శర్మ్ ఎల్ షేక్కు సమీపంలో పడింది. ప్రాణనష్టం వివరాలు తెలియరాలేదు. అయితే, ఇజ్రాయెల్ను లక్ష్యంగా చేసుకుని ఆ క్షిపణిని ప్రయోగించారా? అనే అంశంపై ఐడీఎఫ్ దర్యాప్తు చేస్తున్నట్లు సమాచారం. ఇజ్రాయెల్పై తమ దాడులను పునఃప్రారంభిస్తామని ఇటీవల హూతీలు ప్రకటించిన నేపథ్యంలో.. టెల్అవీవ్ ఇప్పటికే అప్రమత్తమైంది. డ్రోన్, క్షిపణి దాడులు జరిగే అవకాశం ఉందని హెచ్చరించింది. హూతీలకు సమయం దగ్గరపడిందంటూ.. వారికి మద్దతు ఇవ్వడాన్ని నిలిపివేయాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇప్పటికే ఇరాన్ను హెచ్చరించారు. వారి చర్యలకు ఇరానే పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. ఈ వ్యాఖ్యలను టెహ్రాన్ ఖండించింది. హూతీల దాడుల్లో తమ దేశానికి



ఎటువంటి ప్రమేయం లేదని ఇరాన్ రివల్యూషనరీ గార్డ్ చీఫ్ జనరల్ హుస్సేన్ సలామీ స్పష్టం చేశారు. మిలిటెంట్ గ్రూపుల విధానాల రూపకల్పన విషయంలో తమ పాత్రేమీ లేదన్నారు. ఇరాన్ విదేశాంగశాఖ మంత్రి అబ్బాస్ అరఘ్చి స్పందిస్తూ.. హూతీలపై అమెరికా దాడులను నిలిపివేయాలన్నారు. తమ విదేశాంగ విధానాలను అమెరికా నిర్దేశించలేదన్నారు. ఇక అగ్రరాజ్య దాడులను హూతీ పొలిటికల్ బ్యూరో యుద్ధ నేరంగా పేర్కొంది.

## 9 నెలలు అంతరిక్షంలోనే..
# సునీతా విలియమ్స్ అదనపు 'జీతం' ఎంతో తెలుసా?

అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి ఎనిమిది రోజుల పర్యటనకు వెళ్లిన సునీతా విలియమ్స్, బుచ్ విల్మోర్లు సుమారు తొమ్మిది నెలల అక్కడే గడపాల్సి వచ్చింది. చివరకు స్పేస్ఎక్స్ డ్రాగన్ అక్కడకు వెళ్లడం, ఐఎస్ఎస్తో విజయవంతంగా అనుసంధానం కావడంతో.. ఆ ఇద్దరు భూమ్మీదకు వచ్చేందుకు మార్గం సుగమమైంది. అయితే, వ్యోమగాముల జీతభత్యాల గురించి కొంత సమాచారం తెలిసినప్పటికీ.. సుదీర్ఘ కాలం అంతరిక్షంలోనే ఉండిపోయినందుకు నాసా వీరికి ఏమైనా అదనంగా చెల్లిస్తుందా? అనే అంశం ఆసక్తికరంగా మారింది. అంతరిక్షంలో నిర్దేశిత సమయం కన్నా ఎక్కువ కాలం పనిచేసిన ఈ వ్యోమగాములకు అదనంగా ఎలాంటి చెల్లింపులు ఉండవని నాసా విశ్రాంత వ్యోమగామి క్యాడీ కోల్మన్ పేర్కొన్నారు. ఫెడరల్ ఉద్యోగులు అయినందువల్ల.. అంతరిక్షంలో వారు పనిచేసిన కాలాన్ని భూమ్మీద సాధారణ పర్యటన చేసినట్లుగానే పరిగణిస్తారని చెప్పారు. సాధారణంగా వచ్చే జీతంతోపాటు ఐఎస్ఎస్లో ఆహా రం, బస ఖర్చులను



నాసా (NASA) భరిస్తుందన్నారు. ఇటువంటి అనూహ్య పరిణామాలు చోటుచేసుకున్నప్పుడు మాత్రం అదనంగా రోజుకు నాలుగు డాలర్లు (సుమారు రూ.348) మాత్రమే వచ్చే అవకాశం ఉందన్నారు. 201011లో మిషన్లో భాగంగా 159 రోజులపాటు ఐఎస్ఎస్లో ఉన్నానని, అందుకు మొత్తంగా 636 డాలర్లు మాత్రమే అదనంగా చెల్లించారన్నారు. ఈ లెక్కన సునీతా విలియమ్స్, బుచ్ విల్మోర్లకు తొమ్మిది నెలలకు గాను దాదాపు 1100 డాలర్లు (సుమారు రూ.లక్ష) మాత్రమే అదనంగా పొందే అవకాశం ఉందని తెలుస్తోంది.

**జీతం ఎంత..?**

నాసా ఉద్యోగులు.. అమెరికా ప్రభుత్వ ఉద్యోగులు పొందే జీతభత్యాలే పొందుతారు. వ్యోమగాములకు జనరల్ షెడ్యూల్ జీఎస్13 నుంచి జీఎస్ 15 కింద చెల్లింపులు ఉంటాయి. సునీతా విలియమ్స్, బుచ్ విల్మోర్లు అత్యధిక గ్రేడ్ జీఎస్15 గ్రేడ్ పే జీతం అందుకుంటున్నారు. దీని ప్రకారం.. వార్షిక వేతనం 1,24,133 డాలర్ల నుంచి 1,62,672 డాలర్ల (సుమారు రూ.1.08 కోట్ల నుంచి రూ.1.41కోట్లు) మధ్యన ఉంటుందని సమాచారం. ఇదిలాఉంటే, గతేడాది జూన్ 5న ప్రయోగించిన బోయింగ్ వ్యోమనౌక స్టార్లైనర్లో సునీతా విలియమ్స్, బచ్ విల్మోర్లు ఐఎస్ఎస్కు చేరుకున్నారు. అయితే, స్టార్లైనర్లో సమస్యలు తలెత్తడంతో వారిద్దరూ లేకుండానే అది భూమిపైకి చేరింది. దీంతో వారిని తీసుకువచ్చేందుకు ప్రయత్నించినప్పటికీ పలు అవాంతరాలు ఎదురయ్యాయి. చివరకు దాదాపు తొమ్మిది నెలల తర్వాత సునీతా, విల్మోర్లు భూమికి తిరిగి రానున్నారు.